క్లుప్తంగా

క్షతగాత్రురాలికి ఆర్థిక సాయం



షైనీకి ఆర్థికసాయం అందజేస్తున్న పాస్టర్, దాతలు

పామూరు: మండలంలోని మోపాడు గ్రామానికి చెందిన ముప్పారపు షైనీ గత నెలలో రైలు దిగుతూ ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుంది. ఈ సందర్భంగా సోమవారం ఆమెకు బెంగుళూరుకు చెందిన సెవన్త్‌డే అడ్విన్ టిస్ట్ తెలుగు సంఘ కాపరి నాయకులు రూ. లక్ష విరాళం ప్రకటించారు. విరాళం నగదును పాస్టర్ రాజేష్, కె.సామ్యేలు, ఎం అబ్రహం అందజేశారు. సీడీపీఓ కే.దేవకృపావరం, పలువురు పాల్గొన్నారు.

కూలీలందరికీ పని కల్పించాలి



కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రభాకర్‌శర్మ

పీసీపల్లి: అడిగిన ప్రతి కూలికి పని కల్పించాలని ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ అన్నారు. మండల పరిధిలోని పెదయిర్లపాడులో జరుగుతున్న ఉపాధి పనిని సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలందరికీ పట్టల సౌకర్యం కల్పించాలన్నారు. కూలీలకు కనీస కూలి పడేలా పనులు చేయించాలని సూచించారు. కూలీలందరికీ పని కల్పించాలని ఉన్నతాధికారులు చెబుతున్నా. ఫీల్డ్ అసిస్టెంట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, మరోసారి ఇలా జరిగితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు



దుకాణదారులతో మాట్లాడుతున్న ఎస్సై ప్రేమ్‌కుమార్

కొండపి: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా రోడ్లపై వాహనాలు నిలిపితే కేసులు నమోదు చేస్తామని ఎస్సై ప్రేమ్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు దుకాణదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల ఎదుట వాహనాలను నిలిపినా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం డ్రోన్ కెమెరాతో ట్రాఫిక్‌ను పర్యవేక్షించారు. హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి

పొన్నలూరు: మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుద్దుగుంట మల్లికార్జునరెడ్డి అన్నారు. పొన్నలూరులో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని పంచాయతీల నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసి గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు, సామాన్యులపై దాడులు చేసి కేసులు పెట్టడం తప్ప ప్రజలకు చేసిన మేలు ఏం లేదన్నారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను క్షేత్ర స్థాయిలో ప్రజలకు వివరించి ప్రజలు తరుపున నిలబడి పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న ద్వంద విధానాన్ని ప్రశ్నిస్తూ రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వార్డుల్లో పర్యటించిన చైర్మన్

కనిగిరిరూరల్: పట్టణంలోని పలు వార్డుల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ సోమవారం పర్యటించారు. దేవాంగనగర్‌లో జరుగుతున్న అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులను, 15వ ఆర్థిక సంఘ నిధులతో జరుగుతున్న రోడ్లు, కాలువ పనులను, ఐదవ వార్డులోని కనకపట్నం, పాత శంవరం ఏరియాలో కాలువ పనులను ఆయన పరిశీలించారు. దశలవారీగా పట్టణంలోని అన్ని వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. చైర్మన్ వెంట ఏఈలు కోటేశ్వరరావు, మాధవరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షరీఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఈఓఆర్డీగా రాంప్రసాద్ బాధ్యతల స్వీకరణ

పీసీపల్లి: ఈఓఆర్డీగా సింగంపల్లి రాంప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరి పంచాయతీ కార్యదర్శిగా వెళ్లారు.

శిథిల భవనాల్లో

బిక్కు..బిక్కు..



చెర్లోపల్లెలో శిథిల భవనం వరండాలో నిర్వహిస్తున్న క్లాసులు, చేస్తున్న వంట



పెచ్చులూడి కూలేందుకు సిద్ధంగా ఉన్న చెర్లోపల్లె ఎంపీపీఎస్ పాఠశాల శ్లాబు

- తరగతి గదుల్లో పెచ్చులూడి పడుతున్న స్లాబ్
- భయాందోళనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు
- నూతన గదుల నిర్మాణం చేపట్టాలంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రేగులచెలక, చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. తరగతి గదుల్లోని శ్లాబు పెచ్చులూడిపడుతుండటంతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఉపాధ్యాయులు చేసేది లేక వరండాలోనే తరగతులు నిర్వహించాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వంలో నాడు నేడు కార్యక్రమం 3వ విడతలో ఈ పాఠశాల నూతన గదులను నిర్మించాల్సి ఉండగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో ఆపథకాన్ని రద్దుచేసింది. గత ప్రభుత్వం అమలుపరుస్తున్న నాడు నేడు పథకాన్ని కూటమి ప్రభుత్వం మనబడి మన భవిష్యత్‌గా పథకంగా పేరు మార్చారే తప్ప అధికారం చేపట్టి 10 నెలలు దాటినా పాఠశాలల నూతన భవనాల మంజూరు, నిర్మాణంపై అడుగు ముందుకు పడిన దాఖలాలు లేవు. గత 3న జరిగిన మండల సమావేశంలోనూ ఈ పాఠశాలల భవనాల గురించి చర్చ జరగ్గా..ప్రతిపాదనలు పంపించామని చెప్పి చేతులు దులుపేసుకున్నారు. దీంతో పాఠశాలలో ఏదైనా ప్రమాదం జరిగితేనే స్పందిస్తారా అంటూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెర్లోపల్లె పాఠశాలలో వర్షాకాలంలో పాఠశాల తరగతి గదుల్లో వర్షం నీరు కారుతుండటంతో గదుల్లో ఉండే పరిస్థితి లేక పోగా విద్యార్థులను పంచాయతీ కార్యాలయంలో ఉంచాల్సిన దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో 21 మంది విద్యార్థులు ఉండగా పాఠశాల పునాదిగోడలు పూర్తిగా దెబ్బతినగా కిటికీపై శ్లాబుకూడా పూర్తిగా దెబ్బతిని పడిపోయి వేలాడుతూ ప్రమాదకరంగా ఉంది. ఈ శిథిల భవనంలోనే ముందు వరండాలో క్లాసులు, మరోగది వరండాలో మధ్యాహ్న భోజనం వండుతున్నారు. రేగులచెలక పాఠశాల గదులు పూర్తిగా దెబ్బతిని ఉన్నాయి. పాఠశాల వరండా గోడ పూర్తిగా నెర్రెలిచ్చి ఏక్షణంలోనేనైనా పడిపోయేందుకు సిద్ధంగా ఉంది. ఈ పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉండగా బిక్కుబిక్కుంటూ గడుపుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రమాదం జరగకముందే పాతపాఠశాల భవనాల స్థానంలో నూతన భవనాలను మంజూరు చేసి కొత్తభవనాలు నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.



పగుళ్లిచ్చిన గోడలు, ఊడిపోయిన కిటికీలతో ఉన్న రేగులచెలక ఎంపీపీఎస్ పాఠశాల భవనం

నూతన భవనాలకోసం ప్రతిపాదనలు పంపాం : రాజాల కొండారెడ్డి, ఎంఈఓ, సీఎస్‌పురం

మండలంలోని చెర్లోపల్లె(ఏకునాంపురం), రేగులచెలక పాఠశాలల పూర్తిగా శిథిలావస్థలో ఉన్నాయి. శిథిల భవనాల స్థానంలో మనబడి మన భవిష్యత్ పథకంకింద నూతన భవనాలు మంజూరుచేసి నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపాం. త్వరలో భవనాలు మంజూరయి వచ్చే విద్యాసంవత్సరంలో భవనాల నిర్మాణం చేపట్టి పూర్తిచేస్తాం.

వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులు:



వర్షాకాలంలో పాఠశాల పూర్తిగా కురుస్తుంది. ఈ సమయంలో తరగతులు వేరేచోట నిర్వహిస్తారు. పాఠశాల కిటికీలపై శ్లాబు వేలాడుతోంది. ఎప్పుడైనా పడిపోయేలా ఉంది. దీంతో మా పాఠశాలలో తరగతులు వరండాలోనే నిర్వహిస్తున్నారు.

జి.వీరగణేష్, విద్యార్థి, చెర్లోపల్లి

పాఠశాలకు రావాలంటే భయంగా ఉంది:



పాఠశాలలో శ్లాబ్ దెబ్బతిని పెచ్చులూడి పడుతోంది. దీంతో పాఠశాలకు రావాలంటే భయంగా ఉంది. మరోపక్క గోడ పగుళ్లిచ్చి పడిపోయేలా ఉంది. త్వరితగతిన పాఠశాల కొత్త భవనం నిర్మించి మాకు అందుబాటులోకి తేవాలి.

ఎల్.వి.సంజన, విద్యార్థి, రేగులచెలక

కృష్ణారెడ్డిని పరామర్శించిన దద్దాల



కృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న దద్దాల నారాయణ యాదవ్, నేతలు

పీసీపల్లి: మండల పరిధిలోని అడివిలోపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కోడూరి కృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ సోమవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కృష్ణారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గోపవరపు బొర్రారెడ్డి, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం ఓకేరెడ్డి, పోలు జయరామిరెడ్డి, ఎరువ నరసింహ చౌదరి, ఆవుల భాస్కర్రెడ్డి, పడుచూరి రమేష్‌గౌడ్, మూలే మాల్యాద్రి రెడ్డి, శీలం సుదర్శన్, కోడూరి కొండారెడ్డి, చెన్నుపల్లి ఓంకార్, పాలగిరి బాలిరెడ్డి, చల్లా సుబ్బారాయుడు, నాగేశ్వరరావు, అత్యాల ఇసాక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో జరిగిన సీతారాముల కల్యాణంలో పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పామూరు: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో కాలనీల నిర్మాణం వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎల్.బ్రహ్మయ్య పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలో నిర్మిస్తున్న కాలనీల నిర్మాణం, పారిశుధ్యంపై సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ పీఎస్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో కాలనీల నిర్మాణ పనులను పర్యవేక్షించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. పారిశుధ్యాన్ని నూరుశాతం అమలుచేసేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ అరవిందారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వై.రమేష్, గృహనిర్మాణ అసిస్టెంట్ ఇంజినీర్ రాజమోహన్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బ్రహ్మయ్య

పీసీపల్లి: పెండింగ్‌లో ఉన్న పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ ప్రభాకర్ శర్మ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యలో ఆగిపోయిన గృహాలను జియో ట్యాగింగ్ చేయాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలన్నారు.

వేసవి శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

కనిగిరిరూరల్: గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత విజ్ఞాన వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ 40 రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులను ఉపయోగించుకునే విధంగా తల్లి దండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. గ్రంథపాలకుడు ఎస్‌కే అహమ్మద్ షరీఫ్, జేవీవీ నాయకులు ఎస్‌కే గయాజ్‌బాషా, ఎస్‌కే ఖాజా హుస్సేన్, ఎస్‌కే రహిమాన్, మస్తాన్‌బాబు, మంద్రు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా చూడాలి

కొండపి: పొగాకు బేళ్లలో అన్య పదార్థాలు లేకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని ఒంగోలు రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న వేలాన్ని సోమవారం ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రస్తుత మార్కెట్ దష్ట్యా రైతులు అందరూ మార్కెట్ కు అనుగుణంగా బేళ్లను తీసుకురావాలన్నారు. తేమ, వేడి లాంటివి లేకుండా చూసుకొని వేలానికి తీసుకురావాలని సూచించారు. నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన వేలానికి నేతివారిపాలెం, రామచంద్రాపురం గ్రామాలకు చెందిన రైతులు 1047 బేళ్లను తీసుకురాగా 900 బేళ్లను కొనుగోలు చేసి 147 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.224, సరాసరి ధర రూ.265.93గా పలికింది. వేలంలో 17 కంపెనీల వ్యాపారుల పాల్గొన్నారు



వేలాన్ని పరిశీలిస్తున్న రీజనల్ మేనేజర్ లక్ష్మణరావు

ఆంజనేయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ప్రారంభం



ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువస్తున్న భక్తులు

- వైభవంగా ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారి పల్లెలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట, సీతా, రామ, లక్ష్మణ, హనుమంత ఉత్సవ మూర్తులు ఉత్సవం రుత్వికులు చిమటా కార్తీక్ ఆధ్వర్యంలో వేదమంత్రాల నడుమ సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మొదట గణపతిపూజ, పుణ్యాహవాచనం, మాతృకాపూజ, పంచగవ్యప్రాశన, రంక్షాబంధనం, ఆచార్యాది రుత్వీగరణం, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, యంత్రాలకు మహన్యాసపూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం సాయంత్రం విగ్రహాల జలాధివాసం, దీక్షాహోమాలు, కుంకుమార్చన నిర్వహించారు. ఈ సందర్భంగా సీతా, రామ, లక్ష్మణ, హనుమంత నూతన పంచలోహ విగ్రహమూర్తులను ఉత్సవంగా ఆలయానికి తీసుకువచ్చి అభిషేకం నిర్వహించారు. ఈసందర్భంగా నిర్వహించిన కోలాటం అలరించింది.

దిగజారుతున్న ధరలు

- రోజురోజుకి తగ్గుతున్న లోగ్రేడు పొగాకు ధరలు
- రోజూ వందల్లో తిరస్కరణకు గురవుతున్న లోగ్రేడు పొగాకు బేళ్లు
- పట్టించుకోని పొగాకు బోర్డు అధికారులు
- ఆందోళనలో రైతులు



టంగుటూరులో వేలం నిర్వహిస్తున్న అధికారులు

టంగుటూరు: పొగాకు లో గ్రేడ్ ధరలు రోజు రోజుకి తగ్గుముఖం పట్టడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 19న గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.260తో ప్రారంభం కాగా..50 రోజుల్లోనే కనిష్ట ధర రూ.45 తగ్గించారు. వేలం ప్రక్రియలో బయర్లు లోగ్రేడు పొగాకు వైపు కన్నెత్తి చూడపోవడంతో ప్రతి రోజు వందల సంఖ్యలో బేళ్లు తిరస్కరణకు గురవుతున్నాయి. లోగ్రేడు పొగాకు కొనుగోలు చేయకపోవడం, ధర తగ్గడం వంటివి జరుగుతున్నా పొగాకు బోర్డు అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కనీసం పొగాకు కంపెనీ ప్రతినిధులు, రైతులతో సమావేశాల నిర్వహించిన దాఖలాలు లేవు. పొగాకు బోర్డు అధికారులు మాత్రం వారానికి ఒక రోజు తూతూమాత్రంగా వేలం ప్రక్రియని పరిశీలించి, ఫొటోలు దిగి బోర్డు ఉన్నాధికారులకు పంపుకోవడమే తప్ప పొగాకు కంపెనీలు ఎందుకు లోగ్రేడు కొనడం లేదు, ధర ఎందుకు తగ్గిస్తున్నారని అడిగిన దాఖలాలు లేవని రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది కంటే పొగాకు బ్యార్నీ, పొలం కౌలు, కూలీల ఖర్చులు ఎక్కువయ్యాయి. ఇప్పటికైనా పొగాకు బోర్డు అధికారులు అన్ని కంపెనీల ప్రతినిధులు వేలం ప్రక్రియలో పాల్గొనేలా చేయాలని, పొగాకు ధరలపై ఆలోచించాలని రైతులు కోరుతున్నారు.

110 పొగాకు బేళ్ల తిరస్కరణ

స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో సోమవారం జరిగిన వేలంలో 110 బేళ్ల తిరస్కరించారు. వాటిలో లోగ్రేడు పొగాకు బేళ్లు అత్యధికం. తూర్పునాయుడుపాలెం, కాకుటూరివారిపాలెం గ్రామాలకు చెందిన రైతులు 720 బేళ్లను వేలానికి తీసుకురాగా 610 బేళ్లను కొనుగోలు చేసి 110 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.280, కనిష్ట ధర రూ.215, సరాసరి ధర రూ.249.03గా నమోదైంది. వేలంలో 20 కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

పొన్నలూరు: మండలంలోని నాగిరెడ్డిపాలెంలో ఈ నెల 29 నుంచి మే 3 వరకు సీతా సమేత రామచంద్రస్వామి, అభయాంజనేయ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట, దేవాలయ ప్రారంభ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గంగానయనం, గణపతి పూజతో విగ్రహాల ప్రతిష్టా ఉత్సావాలు ప్రారంభమవుతాయి. 30న స్వామి దంపతులకు మంగళహారతులు, మే 1న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట, 2న శత విష్ణు సహస్రనామ పారాయణం, 3న సీతారాముల విగ్రహ ప్రతిష్టా ధ్వజ శిఖర కలిశం, మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం నిర్వహిస్తామన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రుణాలు నూరుశాతం వసూలు చేయాలి

హనుమంతునిపాడు: గ్రామ సంఘాల సభ్యులు తీసుకున్న బ్యాంక్ లింకేజీ రుణాలు నూరుశాతం వసూలు చేయాలని ఏపీఎం పి.రజనీకుమారి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో మండల గ్రామ సమాఖ్య సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సంఘాలు తీసుకున్న స్త్రీ నిధి బ్యాంక్ లింకేజీ రుణాలు రూ. 1.45 కోట్లు, ఉన్నతి రూ.50 లక్షలు, సీఐఎఫ్ రూ.35 లక్షలు, హెచ్‌డీ రూ.10 లక్షలు, వీఆర్‌ఎఫ్ రూ.20 లక్షలు గ్రామ సంఘాలు తీసుకున్న బ్యాంకు రుణబకాయిలు ఉన్నాయన్నారు. వెంటనే గ్రామ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, సీసీలు, రికవరీ చేయించాలన్నారు. రికవరీ చేస్తేనే తిరిగి రుణాలు మంజూరు చేస్తామన్నారు. రికవరీపై ప్రత్యే దృష్టి పెట్టాలని సూచించారు. మండల మహిళా సమాఖ్య సంఘ అధ్యక్షుడు కోటయ్య, కార్యదర్శి, కోశాధికారి షేక్ ఆస్మా, తులసి, సీసీలు దానియేలు, తినకమ్మ, సునీత పాల్గొన్నారు.

డ్రాపౌట్స్‌ను పాఠశాలల్లో చేర్పించండి



కిశోర వికాసం కిట్లతో అధికారులు.

కొండపి: డ్రాపౌట్స్‌ను గుర్తించి పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని బాలల రక్షణ అధికారి ఐ శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఆమె పాల్గొన్నారు. వచ్చే నెల 2 నుంచి జూన్ 10వ తేదీ వరకు సమ్మర్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. కిశోర బాలికలకు ఎదురయ్యే పరిస్థితులపై అవగాహన కల్పించాలన్నారు. కిశోర బాలలు పోషకాహారం సరిగ్గా తీసుకోవడం, రక్తహీనత లేకుండా చూడడం పరిశుభ్రతపై ఎక్కువ దృష్టి సారించాలన్నారు. ఎంపీడీఓ రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో బాల బాలికలపై డిజిటల్ మాధ్యమాలు ప్రభావితం చేస్తున్నాయని, ప్రమాదకర పరిస్థితుల నుంచి దూరం చేసి వారిని సన్మార్గంలో తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులను చైతన్యపరచాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విక్టోరియారాణి, మెడికల్ అధికారి నరసింహారావు, ఎంఈఓ-2 రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

టంగుటూరు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి అన్నారు. తూర్పునాయుడుపాలెంలోని క్యాంపు కార్యాలయంలో జిల్లా వైద్యాధికారి, నియోజకవర్గ వైద్యాధికారులతో సోమవారంసమీక్షించారు. కొండపి ప్రభుత్వ ఆస్పత్రిలో రూంలకు సంబంధించి పలు మార్పులపై చర్చించారు. కార్యక్రమంలో ఆరు మండలాల వైద్య అధికారులు పాల్గొన్నారు.

సింగరాయకొండ: మండలంలోని పాకల పల్లెపాలెంలో మత్స్యకార భరోసా పంపిణీ, సిమెంట్ రోడ్ల ప్రారంభోత్సవంలో మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి పాల్గొన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పాకల బీచ్‌ను పర్యాటక రంగంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఒంగోలు ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, మత్స్య శాఖాధికారులు రవి, ఎస్‌పీఎస్ వర్షిణి, ఎంపీడీఓ డి.జయమణి, తహశీల్దార్ రవి, సర్పంచ్ సైకం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి

టంగుటూరు: బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యతని సార్స్ స్వచ్ఛంద సంస్థ ఏపీడీ రావి ప్రహిసిత్ అన్నారు. స్థానిక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో జిల్లాలో 318 బాల్య వివాహాలను రద్దు చేసేందుకు పోలీసు, స్త్రీశిశు సంక్షేమం ఇతర శాఖల సమన్వయంతో కృషి చేస్తున్నారని 57 మందిపై కేసులు నమోదు చేయించి 72 మంది బాలబాలికలను రక్షించామన్నారు. రానున్న అక్షయ తృతీయకు బాల్య వివాహాలు పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయని, గ్రామాల్లో మత పెద్దలు, గ్రామ పెద్దలతో మాట్లాడి అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్లు శ్రీనివాసరావు, సుమన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.